క్లుప్తంగా

రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడిగా రాంప్రసాద్



కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న రాంప్రసాద్

దాబాగార్డెన్స్: రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడిగా కంచర్ల రాంప్రసాద్ ఎన్నికయ్యారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కల్యాణ్ చక్రవర్తి ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కంప్యూటర్స్, కలర్ ప్రింటర్, డిజిటల్ స్కీన్స్ అందజేశారు. స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ పిల్లలకు 2 కంప్యూటర్లు, కలర్ ప్రింటర్, పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం కింద స్కాలర్‌షిప్పులు అందించారు. రాంప్రసాద్ మాట్లాడుతూ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైనందుకు సంతోషిస్తున్నానన్నారు. పేద విద్యార్థుల చదువులకు స్కాలర్‌షిప్స్, కంప్యూటర్స్‌తోపాటు స్టడీ మెటీరియల్ అందిస్తున్నామని తెలిపారు.

అర్జీలను తక్షణం పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న జోన్-4 జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చిన అర్జీలపై వెంటనే స్పందించి, పరిష్కరించాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అధికారులకు సూచించారు. జోన్-4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి 2, ప్రజారోగ్య విభాగానికి 2 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

జోన్-5కు 4 వినతులు



జోన్-5 కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి నాలుగు వినతులను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01, వాటర్ సప్లై విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, వాటర్ ఏఈ సుమన్, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, జనార్దనరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ పోస్టర్ ఆవిష్కరణ

బీచ్‌రోడ్డు: చీడ పురుగుల నుంచి పంటను కాపాడేందుకు దోహదపడే జీవన ఎరువుల ఆవశ్యకతను తెలుపుతూ వ్యవసాయ శాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ క్రమంలో పలువురు రైతులకు సంబంధిత బయో ఫెర్టిలైజర్స్ ఎరువులతో కూడిన బాటిళ్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ జీవన ఎరువుల వినియోగం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్, ఫోన్ల అందజేత

బీచ్‌రోడ్డు : దివ్యాంగులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జేసీ కె. మయూర్ అశోక్ చేతుల మీదుగా ఉపకరణాలు పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఐదుగురు దివ్యాంగులకు సైన్ లాంగ్వేజ్ ఇన్‌స్టాల్ చేసిన నాలుగు టచ్ మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్‌ను అందజేశారు. డీఆర్వో భవానీ శంకర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఆకతాయిలు

- పాతనగరంలో గంజాయి, మందుబాబుల హల్‌చల్
- 38వ వార్డులో అసాంఘిక కార్యకలాపాలు
- హడలిపోతున్న స్థానికులు
- పోలీస్ చర్యలు తూతూ మంత్రమే

దాబాగార్డెన్స్: ఒకప్పటి పాతనగరం.. ప్రస్తుతం గంజాయి, మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. ఎక్కడ చూసినా గంజాయి బ్యాచ్‌లే. ఏ వీధికెళ్లినా మందుబాబులే. మరీ ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. పాతనగరం 38వ వార్డు కంచర వీధిలో పలువురు ఆకతాయి యువత రెచ్చిపోతున్నారు. సాయంత్రం పొద్దుపోతే విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలు.. యువతీ యువకుల చెట్టా పట్టాలు.. మందుబాబుల చిందులు.. గంజాయి బ్యాచ్ రౌడీయిజం వంటి జరుగుతున్నాయి. మరిడిమాంబ గుడి ముందు ఉన్న ప్రహరీపై అసభ్య పదజాలం రాశారు. అటుగా వెళ్లే పాదచారులు, దేవాలయానికి వచ్చే భక్తులు ఆ పదాలు చూసి విస్తుపోతున్నారు. వందలాది కుటుంబాలు నివసిస్తున్న కంచర వీధి ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరుతున్నాయని.. సాక్షాత్తు ఆ ప్రాంతానికి చెందిన ఓ వైద్యుడు నేరుగా వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఒకసారి.. రెండు సార్లు స్పందించారు. కఠిన చర్యలు తీసుకోలేక పోయారు. రాత్రి 11 గంటల తర్వాత గంజాయి సేవించడం వంటి ఏవేవో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చాలా సార్లు కళ్లారా చూశామని, పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ధైర్యంగా చెప్పాలంటే భయమేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ అభిమానులమంటూ కొందరు యువకులు బెదిరిస్తున్నారని ఆలయ పూజారి ఎంతో ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఇంత జరుగుతున్నా.. ఎవరూ ముందుకు రావడం లేదు. గంజాయి బ్యాచ్ దాడులకు దిగుతుందేమోనన్న భయంతో హడలి పోతున్నారు.

దాడులు.. బెదిరింపులు

నియోజకవర్గంలోని వన్ టౌన్, టూ టౌన్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి బ్యాచ్ ఆగడాలు మితిమీరుతున్నాయి. వారు దాడులకు ప్రేరేపిస్తున్నారు. హత్యలకు పాల్పడుతున్నారు. బెదిరింపులకు దిగుతున్నారు. ఎవరూ పట్టించుకోక పోవడంతో ఈ ప్రాంతంలో ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.



38వ వార్డులో అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైన కంచర వీధి మరిడిమాంబ ఆలయ సమీప ప్రాంతం

ఆగడాలను అరికట్టాలి

పాతనగరంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దృష్టికి తీసుకెళ్తున్నా.. చర్యలు తూతూ మంత్రమేనని పలువురు వాపోతున్నారు. ఆ సమయానికి పోలీసులు వస్తున్నారు.. హెచ్చరిస్తున్నారు. రెండు రోజుల తర్వాత షరామామూలు అయిపోతోందని చెబుతున్నారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని ఆకతాయిలు మరింత రెచ్చిపోతున్నారని, ఫలితంగా ఎవరూ ముందుకు రావడం లేదనే అంటున్నారు. నేరుగా పోలీస్ కమిషనర్ సడన్ విజిట్ చేసి గంజాయి బ్యాచ్, మందుబాబుల చిందులు అరికట్టేలా చర్యలు చేపట్టాలని కంచర వీధి ప్రాంత వాసులు కోరుతున్నారు.



ఆకతాయిలకు అడ్డాగా కంచర వీధి

నేను పవన్ కల్యాణ్ తాలూక..

'నేను పవన్ కల్యాణ్ తాలూక. నువ్వు ఎవ్వడివిరా? నేను తలచుకుంటే లేపేస్తా' అని బెదిరిస్తూ ఓ వైద్యుడిపై పవన్ కల్యాణ్ అభిమాని విరుచుకుపడి రెండు నెలలు కాలేదు.. ఆ వైద్యుడు కన్నీటితో తన ఆవేదనను పోలీసుల వద్ద కూడా మొరపెట్టుకున్నారు. 'ఓ అభాగ్యురాలు తన చంటి పిల్లలతో మండుటెండలో ఆకలితో అలమటిస్తుంటే.. స్వయాన చూసిన తాను వారి ఆవేదనను చూసి తట్టుకోలేక బిస్కెట్లు, కూల్ డ్రింక్స్ కొనిచ్చాను. సంతోషంతో ఆ పిల్లలు సమీపాన ఉన్న మరిడిమాంబ ఆలయం షెల్టర్ వద్దకు వెళ్లి రోడ్డు మధ్యన తింటుంటే.. పవన్ కల్యాణ్ అభిమాని స్పీడ్‌గా వచ్చి సడన్ బ్రేక్ వేశాడు. ఎందుకు బాబు అంత స్పీడని.. ఇది వీధి కదా.. కొంచెం నెమ్మదిగా వెళ్లొచ్చు కదా.. ఆ వేగంలో పిల్లాడిని నువ్వు గుద్దిస్తే రెప్పపాటులో చనిపోయేవాడని ప్రశ్నించినందుకు తనపైనే ఆ యువకుడు రెచ్చిపోయాడని.. నేను తలచుకుంటే లేపేస్తా. .అంటూ దౌర్జన్యంగా ప్రవర్తించాడు' అని సదరు వైద్యుడు కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా.. తూతూ మంత్రంగానే వారి చర్యలు ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చాడు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

నేరెళ్లకోనేరులో కార్డన్ సెర్చ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అల్లిపురం: టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నేరేళ్లకోనేరు కాలనీలో సోమవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో నివాసుల గుర్తింపు కార్డులతోపాటు వాహనాల పత్రాలను పరిశీలించారు. ఇందులో పత్రాలు లేని 21 వాహనాలను గుర్తించారు.

అక్రమ మద్యం కేసులో అరెస్టులు దారుణం

- వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు రవీంద్రభరత్



మాట్లాడుతున్న రవీంద్రభరత్

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అక్రమ మద్యం కేసులో చేస్తున్న అరెస్టులను వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ తీవ్రంగా ఖండించారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13 నెలలుగా వైఎస్సార్ సీపీ చేస్తున్న ప్రజాపోరాటాలను చూసి చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతోందని, అందుకే ఈ అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. లిక్కర్ వ్యవహారంలో మొదట రూ. 50 వేల కోట్లు, ఆపై రూ. 30 వేల కోట్లు, తర్వాత రూ. 18 వేల కోట్లు, రూ. 3 వేల కోట్లు, తాజాగా రూ. 2 వేల కోట్లు అంటున్నారు. ఈ ఆరోపణల్లో స్థిరత్వం లేదని, ఇదంతా కట్టుకథలా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఎక్కడా డబ్బు సీజ్ చేశారా, పెట్టుబడులు పెట్టారా అని ప్రశ్నించారు. ఇవన్నీ లేకుండా కేవలం మాటలతో కట్టుకథలు చెబుతున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసులో ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవని, ఒక్క రూపాయి కూడా పట్టుకోలేదని అన్నారు. కేవలం ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులను బెదిరించి, భయపెట్టి, వారి మాటలు, వాంగ్మూలాలను చూపించి కట్టుకథల కుట్ర కేసును నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు. వైఎస్సార్ సీపీ బలంగా ఉండటం, పార్టీలో ప్రభావవంతంగా పనిచేస్తున్న వారిని టార్గెట్ చేసి అరెస్టులు చేస్తున్నారని రవీంద్రభరత్ తెలిపారు. ఇవి దర్యాప్తు సంస్థలు, కోర్టులు చేస్తున్న ట్రయల్స్ కావని, చంద్రబాబు కక్షతో చేస్తున్న రాజకీయ ట్రయల్ అని పేర్కొన్నారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలకు బెదిరిపోమని, ఆయన దుర్మార్గాలను ఎండగడతామని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ దక్షిణ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బొండాడ వెంకటరమణ, బెవర మహేష్, కంటుముచ్చు సాగర్, చోడిపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు వాసుపల్లి సాయం



రమణకు రూ.10 వేలు ఇస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డు వైఎస్సార్ సీపీ కార్యకర్త బంధువు రమోలు రమణ వైద్య ఖర్చులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రమణ ప్రమాదవశాత్తు వెన్నుపూస విరిగి, మంచాన పడిన విషయం తెలుసుకున్న వాసుపల్లి వెంటనే స్పందించారు. వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు యాసీన్‌ముహ్మద్ (బాబ్జి)తో కలసి వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. వైద్యపరంగా ఎటువంటి సహాయం కావాలన్నా తమకు తెలియపరచాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు ఉచిత వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, సౌత్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, మాధురి, రాంరాజు, సలీమ్, వెంకట్, సత్య తదితరులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మి, శారీ వాక్ అదరహో..



శారీ వాక్ పోటీలో మహిళలు

దాబాగార్డెన్స్: క్వీన్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శ్రావణలక్ష్మి పేరిట నిర్వహించిన సంప్రదాయ శారీ వాక్ విశాఖ వాసులను విశేషంగా అలరించింది. దాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో సోమవారం జరిగిన శారీ వాక్‌లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా నుంచి హాజరైన పలువురు మహిళలు సంప్రదాయ చీరకట్టుతో మిసెస్ శ్రావణలక్ష్మి విభాగంలో, పరికిణి ఓణీలతో యువతులు మిస్ శ్రావణలక్ష్మి విభాగంలో ర్యాంప్‌పై నడుస్తూ అదరగొట్టారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, పీలా వెంకటలక్ష్మి, వసుంధర జ్యూయలరీ శ్రీదేవి, రాజ రాయ్ ప్రమోటర్స్ అప్పలకొండ, రమ సత్యనారాయణతో కలిసి క్వీన్స్ ఈవెంట్స్ నిర్వాహకులు మోదవలస ఉషారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సంగీత, మాధురి, నక్షత్ర, భాగ్యలక్ష్మి వ్యవహరించారు. మిసెస్ కేటగిరీలో మనీషా, మిస్ కేటగిరీలో తన్వీ సుచరిత విజేతలయ్యారు. రన్నరప్‌గా విరోనికా, వెన్నెల, బిందుశ్రీ, దివ్య కిషోర్, రేష్మ, దివ్య రాజేష్ నిలిచారు.

పనిచేయలేకున్నాం.. భారం తగ్గించండి..!

- ఒకే సమాచారాన్ని రెండు యాప్‌ల్లో నమోదుతో అవస్థలు
- పీడీ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరసన



ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ ఝాన్సీరాణికి అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎంవీపీకాలనీ: ఒకే సమాచారాన్ని రెండు యాప్‌ల్లో నమోదు చేయడం వల్ల పనిభారం పెరుగుతుందని అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అంగన్‌వాడీలకు పనిభారం పెరిగిందన్నారు. ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ తప్పనిసరి చేయడంతో పాటు విద్యార్థుల హాజరు, ఫొటో అప్‌లోడ్‌తో పాటు అనేక వివరాలు బాల సంజీవని, పోషణ ట్రెకర్ యాప్‌ల్లో ఒకే సారి చేయాల్సి వస్తోందన్నారు. బాలింతలు, గర్భిణులు సరకుల పంపిణీ కూడా ఓటీపీ, ఈకేవైసీ విధానంలో యాప్‌లో నమోదు చేస్తున్నారన్నారు. దీంతో అంగన్‌వాడీలపై తీవ్ర పనిభారం పెరిగిందన్నారు. పిల్లల పోషణపై దృష్టిపెట్టడం కన్నా యాప్‌ల్లో సమాచారం నమోదు చేయడానికే అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి వస్తోందని వాపోయారు. ఫోన్లు సైతం సక్రమంగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, వేతనాలను రూ.26,000కు పెంచాలని, అంగన్‌వాడీల పిల్లలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కొత్త సెల్‌ఫోన్లు అందజేయాలని, ఒక్కరోజు సెలవుకే సీడీపీవో పర్మిషన్ తీసుకొనే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ ఝాన్సీరాణికి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి, కార్యదర్శి దేవి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వందల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విధానాన్ని నియంత్రించాలి



అంగన్‌వాడీలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు పూర్తి ఆన్‌లైన్ విధానాన్ని సవరించాలి. సమయమంతా ఆయా యాప్‌ల్లో వివరాల నమోదుకే సరిపోతోంది. దీని ప్రభావం స్కూల్ బలోపేతంపైన, విద్యార్థుల అభివృద్ధిపైన పడుతోంది. రానున్న రోజుల్లో అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఉంది.

– కె.వెంకటలక్ష్మి, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు

ఒకే యాప్ విధానాన్ని తీసుకురావాలి



ప్రతిరోజు అంగన్‌వాడీలు రెండు యాప్‌ల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకే సమాచారాన్ని రెండు యాప్‌ల్లో నమోదు చేయడం వల్ల సమయం వృథా అవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్స్ పనిచేయకపోవడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే యాప్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– తులసి, అంగన్‌వాడీ టీచర్

బాబు మోసాలపై ఇంటింటా ప్రచారం



33వ వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న ముత్తాబత్తుల రమేష్, పార్టీ నాయకులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి ముఖమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పచ్చారపల్లి రాము, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, వేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఆదారి వెంకట మహేష్, దక్షిణ నియోజకవర్గ కల్చర్ వింగ్ అధ్యక్షుడు సూర్యానాయుడు, వార్డు కార్యదర్శి సంతోష్‌కుమార్, మహిళా నాయకురాలు హేమ, యువజన విభాగం నాయకుడు బూరుగుల చిన్న, పీవీఎన్ రెడ్డి, చోడిపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

దాబాగార్డెన్స్: ప్రధానమంత్రి అనుసుచిత్ జాతీ అభ్యుదయ్ యోజనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ, ఉపాధికి దరఖాస్తులు కోరుతున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పూర్తి చేసి ఉండాలని, 18 నుంచి 44 ఏళ్లలోపు వయస్సు వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మహారాణిపేట నేక్ కేంద్రంలో రెండు నెలల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో స్టేషనరీ ఉచితంగా అందజేస్తామని, మధ్యాహ్నం ఉచిత భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. శిక్షణ పూర్తిగా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలోనే ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగంలో ప్రైవేట్ సెక్టార్‌లో ఉపాధి కల్పించనున్నట్టు తెలియజేశారు. ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని, శిక్షణకు వచ్చేవారికి తప్పనిసరిగా ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలన్నారు. వివరాలకు 79895 72891లో సంప్రదించాలని సూచించారు.

పూట కూటి కోసం..



ఆకలికి రుచి ఎరగదు అన్నది నానుడి. అందుకు ఈ దృశ్యమే నిదర్శనం. రామకృష్ణ జంక్షన్ వద్ద రైతుబజార్‌లో మిగిలిపోయిన, పాడైన కూరగాయలను చెత్త కుండీలో పడేశారు. ఆ చెత్తలో ఉన్న కూరగాయలను ఒక మహిళ ఏరుకుంటూ తీసుకెళ్తున్న దృశ్యమిది.

సాపాటు కోసమే ఈ పాటు





సీహార్స్ జంక్షన్ ప్రాంతంలోని కల్వర్టు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. వర్షా కాలానికి ముందే చెత్తను తొలగించాల్సిన జీవీఎంసీ సిబ్బంది ఆలస్యంగా మేల్కొన్నారు. సోమవారం ప్రొక్లెయిన్‌తో చెత్తను తొలగిస్తుండగా.. పక్కనే మరో వ్యక్తి ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుంటూ కనిపించాడు.

– ఫొటోలు: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం